సాక్షి
మంచిర్యాల

బుధవారం ¦ 24 ¦ జనవరి ¦ 2024



ఖందేవుని జాతరకు వేళాయె

ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలో ఖందేవుని జాతర ఈ నెల 25న మహాపూజతో ప్రారంభమవుతుంది. 15 రోజులు కొనసాగుతుంది.

10లో▸



బోరు మోటార్ల దొంగల అరెస్టు

జైపూర్‌లో వరుసగా బోరు మోటార్ల చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఏసీపీ మోహన్ వివరాలు వెల్లడించారు.

10లో▸

గరిష్టం/కనిష్టం
29.5 /17.4

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పడప్పుడు మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. చలి ప్రభావం పెరుగుతుంది.

న్యూస్‌రీల్

మృతులకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా

శ్రీరాంపూర్: సింగరేణిలో పనిచేస్తూ ప్రమాదవశాత్తు ఉద్యోగి మరణిస్తే అతని కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించేలా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ)తో ఒప్పందం జరిగిందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి.సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కె.రాజ్‌కుమార్ తెలిపారు. యూబీఐలో బ్యాంకుఖాతా కలిగి ఉన్న ఉద్యోగులకు మాత్రమే ఇది వర్తిస్తుందని పేర్కొన్నారు. దీంతోపాటు ప్రతీ ఉద్యోగి సంవత్సరానికి రూ.306 చెల్లిస్తే అదనంగా మరో రూ.30 లక్షల బీమా కూడా వర్తిస్తుందని వెల్లడించారు. ఎస్‌బీఐ అధికారులతో కూడా ఇలాంటి సదుపాయంపై సింగరేణి యాజమాన్యం సంప్రదింపులు జరుపుతుందని తెలిపారు.

కాంగ్రెస్ నిరసన



కొవ్వొత్తుల నిరసనలో కాంగ్రెస్ నాయకులు

మంచిర్యాలటౌన్: రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్ర అసోంలో జరుగుతోంది. యాత్రలో భాగంగా బటాద్రవ థాన్ అనే ఆలయ దర్శనానికి వెళ్లిన రాహుల్ గాంధీని.. అక్కడి అధికారులు లోపలికి అనుమతిని నిరాకరించారు. శ్రీమంత శంకర్‌దేవ్ చౌక్ వద్ద పాదయాత్రకు అనుమతి ఇవ్వలేదు. దీనిని నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో మంగళవారం నిరసన తెలిపారు. అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో అన్ని హక్కులు ఉంటాయని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఆదేశాల మేరకు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు.

జిల్లా కవికి గిడుగు రామ్మూర్తి పురస్కారం



ప్రశంసాపత్రం అందుకుంటున్న కవి

లక్సెట్టిపేట: పట్టణానికి చెందిన కవి రాజేశ్వర్‌రావు గిడుగు రామ్మూర్తి జాతీయ పురస్కారానికి ఎంపికైనట్లు పట్టణానికి చెందిన సాహితి స్రవంతి అధ్యక్షుడు రవీంద్ర తెలిపారు. రాజేశ్వర్‌రావు అమ్మకు ఒకజత చెప్పులు కొనాలి అనే కవితా సంపుటి పుస్తకాన్ని రచించారు. ఇందుకు ఈనెల 22న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన గిడుగు వర్ధంతి కార్యక్రమంలో మానవ హక్కుల చైర్మన్ జస్టిస్ చంద్రయ్య పురస్కారం ప్రదానం చేసినట్లు వెల్లడించారు.

బీసీలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న గుమ్ముల శ్రీనివాస్

పాతమంచిర్యాల: రాష్ట్ర బడ్జెట్‌లో బీసీల సంక్షేమం కోసం ప్రభుత్వం రూ.50 వేల కోట్లు కేటాయించాలని బీసీ సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జన్మభూమి నగర్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించి బీసీల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. సబ్సిడీ రుణాలు, బీసీ బంధు, బీసీ స్టడీ సర్కిళ్లకు, విద్యార్థుల మెస్ చార్జీలు స్కాలర్‌షిప్‌ల కోసం గత ప్రభుత్వాల కంటే ఎక్కువ నిధులు కేటాయించాలన్నారు. సమావేశంలో బీసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు తులా మధుసూదన్, శ్రీపతి రాములు, బోడెంకి మహేశ్, అంకం సతీశ్, మగ్గిడి రాజశేఖర్, తోకల వెంకటేశ్, ఆరెందుల రాజేశం పాల్గొన్నారు.

దూది రైతు దోపిడీ!

- సీసీఐ కేంద్రాల్లోనూ దళారులదే హవా
- తూకం వేయాలన్నా.. అన్‌లోడ్ చేయాలన్నా.. చెల్లించాల్సిందే
- పత్తి కొనుగోళ్లలోనూ అక్రమాలు
- చోద్యం చూస్తున్న మార్కెటింగ్, సీసీఐ అధికారులు



తాండూర్ మండలంలోని కొనుగోలు కేంద్రంలో పత్తిని అన్‌లోడ్ చేస్తున్న కూలీలు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో దూది రైతు దోపిడీకి గురవుతున్నాడు. దళారుల బెడద నివారించి, రైతులకు మద్దతు ధర చెల్లించాలని సీసీఐ ద్వారా జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు జరుపుతున్నారు. కానీ, సీసీఐ కొనుగోళ్లలోనూ దళారుల పెత్తనమే నడుస్తోంది. ఆరుగాలం కష్టపడి పత్తి సాగుచేసిన రైతులు మద్దతు ధర కోసం సీసీఐ కేంద్రాలకు దిగుబడి తీసుకువస్తున్నారు. కానీ, ఎక్కడా లేని నిబంధనల పేరుతో రైతులను అధికారులు ఇబ్బంది పెడుతున్నారు. ఇదే సమయంలో దళారులు రంగంలోకి దిగుతున్నారు. మద్దతు ధరకన్నా తక్కువకు పత్తి కొనుగోలు చేస్తున్నారు. అదే పత్తిని, తిరిగి సీసీఐకి దళారులు విక్రయిస్తున్నారు. నిబంధనల పేరుతో రైతుల నుంచి కొనుగోలు చేయని పత్తిని, దళారీ నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నారు. అధికారులు, దళారులు కుమ్మక్కై రైతులను దోపిడీ చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక దళారులు ఎప్పుడు పత్తి అమ్మినా కొనుగోలు చేస్తున్న సీసీఐ, రైతులకు మాత్రం తేమశాతం, దూది పింజ పొడవు, ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి అనే నిబంధనలు అమలు చేస్తున్నారు. ధ్రువీకరణ పత్రాలను రైతులే తీసుకురావాలని సూచిస్తున్నారు. ఉదయం 10 గంటలోపు వచ్చిన రైతుల పత్తిని మాత్రమే కొనుగోలు చేస్తున్నారు.

మామూళ్లు ఇస్తే నిబంధనలు తూచ్..

ఇక మిల్లుల్లో రైతులకు నిబంధనలు అడ్డంకిగా మారుతుండగా, మామూళ్లు ఇస్తే, అవేవీ అడ్డు రావడం లేదు. రైతులు రాకపోయినా, పేపర్లు లేకపోయినా కొనుగోళ్లు జరుపుతున్నారు. ఇందుకోసం వాహనాన్ని బట్టి రూ.1000 నుంచి రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నారు. మార్కెటింగ్, సీసీఐ అధికారుల కనుసన్నల్లోనే దళారులు ఈ దందా సాగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలు లేకుండా దళారులు రైతుల నుంచి క్వింటాల్ పత్తిని రూ.6,200 నుంచి రూ.6,400లకు కొనుగోలు చేస్తున్నారు. తర్వాత అదే పత్తిని సీసీఐకి రూ.6,900 నుంచి రూ.7 వేలకు విక్రయిస్తున్నారు.

2,81,260 క్వింటాళ్ల పత్తి కొనుగోలు

జిల్లాలో ఈఏడాది 1.55 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. 10 నుంచి 12 లక్షల క్వింటాళ్ల పత్తి కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వరంగ సంస్థ సీసీఐ ఈ ఏడాది జిల్లాలోని బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డు పరిధిలో రేపల్లివాడలోని మహేశ్వరి కాటన్ మిల్లు, శ్రీరామ జిన్నింగ్, ప్రెసింగ్ మిల్లుల పరిధిలో 2 కొనుగోలు కేంద్రాలు, లక్సెట్టిపేటలోని వెంకటేశ్వర కాటన్ మిల్లులో, చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలో చెన్నూర్ కాటన్ మిల్లు, ఎల్లక్కపేటలోని ఆదిశంకరాచార్య మిల్లు, కిష్టంపేటలోని వరలక్ష్మి ఇండస్ట్రీస్ మిల్లులో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు సీసీఐ, ప్రైవేట్ మొత్తం కలిపి 2,81,260 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశాయి. మార్కెటింగ్ అధికారులు ఈ కొనుగోళ్లను పర్యవేక్షించాలి. సీసీఐ అధికారులు రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలి. వీరు దళారులతో కుమ్మక్కయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తూకం, అన్‌లోడ్‌కూ డబ్బులు..

కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో అన్‌లోడ్ చేసినందుకు కూలీలకు డబ్బులు ఇవ్వొద్దు, తూకం వేసినందుకు, తక్‌పట్టి ఇచ్చినందుకు ఆపరేటర్‌కు డబ్బులు చెల్లించరాదు. కానీ రైతులు తీసుకువచ్చిన పత్తిని అన్‌లోడ్ చేసేందుకు కూలీలు, తూకం, తక్‌పట్టి ఇచ్చినందుకు కంప్యూటర్ ఆపరేటర్‌కు రూ.200 నుంచి రూ.400 వరకు వసూలు చేస్తున్నారు. ఇదేంటని అడిగితే నిబంధనలు అంటూ వాహనాన్ని తూకం చేయకుండా పక్కన పెడుతున్నారని రైతులు పేర్కొంటున్నారు. సాంకేతిక లోపం తలెత్తిందని గంటల తరబడి ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తగ్గిన పత్తి ధర

చెన్నూర్: పత్తి మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,020 ఉండగా, ఈనెల 25 నుంచి క్వింటాల్‌కు రూ.6,920 చెల్లించనున్నట్లు చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు. పత్తి బీబీ మోడ్ నుంచి మెక్ మోడ్‌కు చేరిందని పేర్కొన్నారు. నాణ్యత తగ్గడంతో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ధర రూ.100 తగ్గించిందని వెల్లడించారు. ఈ విషయాన్ని రైతులు గమనించి నాణ్యమైన పత్తిని మార్కెట్‌కు తీసుకురావాలని సూచించారు.

జిల్లాలో ఇప్పటి వరకు కొనుగోలు చేసిన పత్తి వివరాలు..

కొనుగోలు కేంద్రాలు	సీసీఐ	ప్రైవేటుగా
మంచిర్యాల	0	11,168 క్వింటాళ్లు
లక్సెట్టిపేట	14,380	4,144 క్వింటాళ్లు
బెల్లంపల్లి	1,38,978	21,745 క్వింటాళ్లు
చెన్నూర్	62,680	28,130 క్వింటాళ్లు
జన్నారం	0	35 క్వింటాళ్లు
మొత్తం	**2,16,038**	**65,222 క్వింటాళ్లు**

పైసలిస్తేనే కొంటున్నరు..



తేమ శాతం ఎక్కువ ఉందని, రంగుమారిందని, పేపర్లు సరిగా లేవని కొనుగోలు చేయమంటున్నరు. మిల్లుకాడ పనిచేసేటోళ్లు రూ.1000 నుంచి రూ.2 వేలు తీసుకుంటున్నరు. డబ్బులు ఇస్తే అంతా ఓకే అంటున్నరు. ఇవ్వకుంటే సాయంత్రం వరకు పక్కకు పెడుతున్నరు. నిబంధనలు మాట్లాడుతున్నరు.

– ఆశన్న, నెన్నెల

మా దృష్టికి రాలేదు..

జిల్లాలో పత్తి కొనుగోళ్లు సజావుగా సాగుతున్నాయి. రైతులే స్వయంగా ధ్రువీకరణ పత్రాలతో ఒకరైతు ఒకే వాహనంలో పత్తిని తీసుక రావాలని సూచిస్తున్నాం. రైతుల నుంచి డబ్బులు తీసుకుంటున్న విషయం మా దృష్టికి రాలేదు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్ అప్‌డేట్ చేస్తుండడంతో అప్పుడప్పుడూ కొంత జాప్యం జరుగుతోంది.

– గజానంద్, జిల్లా మార్కెటింగ్ అధికారి

ఎంసీహెచ్ తరలింపు సాధ్యమేనా?

- ఐబీలో నిర్మిస్తామని ఎమ్మెల్యే ప్రకటన
- నిర్మిస్తే ఎంతో మందికి మేలు

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీల్లో ఒకే చోట కూరగాయలు, పండ్లు, పూలు, నాన్‌వెజ్‌కు సంబంధించిన మార్కెట్ ఉండాలని గత ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాలు మంజూరు చేసింది. జిల్లా కేంద్రం ఐబీ చౌరస్తాలోని ఐబీ ఆవరణలో 2.06 ఎకరాల స్థలంలో రూ.7.20 కోట్లతో సమీకృత మార్కెట్ యార్డు నిర్మాణాన్ని 2021, నవంబర్ 8న ప్రారంభించారు. అయితే పనులు అంతంత మాత్రంగానే సాగాయి. ప్రస్తుతం నిలిచిపోయాయి.

మాతాశిశు కేంద్రం నిర్మించాలని..

అయితే ఐబీ ఆవరణలో మాతా శిశు ఆరోగ్య కేంద్రం నిర్మించాలన్న డిమాండ్ ఉంది. ఐబీకి ఎదురుగా జీజీహెచ్ ఉన్నందున, ఎంసీహెచ్ కూడా ఇక్కడే నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. కానీ గత ప్రభుత్వం ఎంసీహెచ్‌ను గోదావరి ఒడ్డున నిర్మించింది. ప్రజల డిమాండ్ మేరకు అప్పటి ప్రతిపక్ష పార్టీకి చెందిన కాంగ్రెస్ నాయకులు ఎంసీహెచ్‌ను ఐబీ ఆవరణలోనే నిర్మించాలని ఆందోళనలు చేశారు. కానీ, ఎవరూ పట్టించుకోలేదు.

గోదావరి ఒడ్డున..

ప్రస్తుతం గోదావరి ఒడ్డున నిర్మించిన మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఏటా వర్షాకాలంలో మునుగుతోంది. ఆ సమయంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులను ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్)కు తరలిస్తున్నారు. వర్షాకాలం పూర్తయిన తరువాత తిరిగి గోదావరి ఒడ్డున ఉన్న భవనంలోకి మారుస్తున్నారు. ఏటా ఈ సమస్యతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. వైద్య సిబ్బందికి కూడా ఇబ్బంది కలుగుతోంది. యంత్రాలను అటూ ఇటూ మార్చడం వలన అవి చెడిపోతున్నాయి. సక్రమంగా పనిచేయడం లేదు. మరమ్మతులకు వస్తున్నాయి.

పట్టణంలోకి మారిస్తే..

పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఎంసీహెచ్ ఉండడం, రవాణా సౌకర్యం లేకపోవడంతో గర్భిణులు ఎంసీహెచ్‌కు రాకపోకలను సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. ప్రజలకు సౌకర్యంగా ఉండేలా ఆసుపత్రులను ఏర్పాటు చేయాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ప్రభుత్వానికి విన్నవించారు. ఐబీ ఆవరణలో ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను తొలగించి ఆ స్థానంలో 600 పడకలతో కొత్త ఆసుపత్రి భవనం నిర్మించేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. దీనికి ప్రభుత్వం అనుమతి ఇస్తే ఇప్పటికే నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం పూర్తిగా తొలగించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు ఖర్చు చేసిన నిధులు వృథా కానున్నాయి. అయితే ఐబీ ఆవరణలో ఎంసీహెచ్ నిర్మిస్తే మాత్రం ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

‘అన్‌ఫిట్’ దళారులపై ఏసీబీ కన్ను!

- సింగరేణి మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్‌లో రూ.కోట్ల దందా
- ఏసీబీ దృష్టి సారించాలని కోరిన సింగరేణి సీఎండీ



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: అనారోగ్యంతో బాధపడే సింగరేణి కార్మికులకు మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్‌పై సంస్థ సీఎండీ బలరాం ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అన్‌ఫిట్ చేయిస్తామని దళారులు కార్మికుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారు. దళారుల్లో కొందరు కార్మిక సంఘాల నాయకులు, అధికారులు కూడా ఉన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం కేసీఆర్ సింగరేణిలో లంచం అనేది లేకుండా చేస్తామని చెప్పారు. కానీ ఆచరణలో అమలు చేయలేదు. రిటైర్మెంట్‌కు సమీపంలో ఉన్న కార్మికులంతా మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ అయితే తమ వారసులకు ఉద్యోగం వస్తుందని మెడికల్ బోర్డుకు హాజరవుతున్నారు. ఈ బలహీనత కొందరు దళారులు క్యాష్ చేసుకుంటూ రూ.కోట్లు దండుకుంటున్నారు.

నెలకు రెండుసార్లు బోర్డు మీటింగ్..

కొత్తగూడెం హెడ్ ఆఫీసులో పరిధిలో ప్రతీ నెల కు రెండు సార్లు మెడికల్‌బోర్డు మీటింగ్‌లు జ రుగుతాయి. అక్కడ దళారులు తమ రాజకీయ పలుకుబడి ఉపయోగించి డబ్బులు తీసుకున్న కార్మికులు అన్‌ఫిట్ అయ్యేలా చూస్తున్నారు. ఇందుకు అధికారులకు కూడా కొంత ముట్టజెబుతున్నట్లు సమాచారం. సంస్థ పరంగా విజిలెన్స్ విభాగం ఉన్నా కేసులు, దర్యాప్తు చేసినా ఈ దందాకు అడ్డకట్ట పడడం లేదు.

ఇక ఏసీబీ నజర్

సింగరేణిలో దళారుల దందా అరికట్టేందుకు కొత్త సీఎండీ బలరామ్ అవినీతి నిరోధక శాఖ సహకారం కోరారు. ఏసీబీ డీజీపీ సీవీ.ఆనంద్‌ను కలిసి సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ దందా నిరోధించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఏసీబీ రంగంలోకి దిగింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏసీబీ డీఎస్పీ రమేశ్ టీం సీఎండీతో కలిసి, మెడికల్ బోర్డులో జరిగే ప్రక్రియ వివరాలు సేకరించింది. అన్‌ఫిట్ చేయిస్తామని డబ్బులు అడిగితే వెంటనే ఏసీబీ రంగంలోకి దిగి కేసులు నమోదు చేయడంతోపాటు చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీంతో అర్హులైన కార్మికులకు దళారుల బెడద తప్పే అవకాశం ఉంది.

ప్రజల గుండెల్లో స్థానం పొందాలి

- అభివృద్ధి కోసం మనసుపెట్టి పనిచేయండి
- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క
- ఉట్నూర్‌లో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క, పక్కన ఎమ్మెల్యేలు, కలెక్టర్లు

కైలాస్‌నగర్/ఉట్నూర్‌రూరల్: ‘దేవుడు ఎక్కడున్నాడో తెలియదు.. కానీ వెనుకబడిన ప్రాంతాల ప్రజలకు మనమే దేవుళ్లం.. రాజకీయాల జోలికి వెళ్లకుండా అధికారులు, ప్రజా ప్రతినిధులు మనస్సు పెట్టి పనిచేయాలి.. ప్రజా సమస్యల పరిష్కారానికి మనవంతుగా కృషి చేద్దాం..’ అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. ప్రజలకు మంచి చేస్తే ఏ విధంగా గుండెల్లో పెట్టి చూసుకుంటారో హైమన్‌డార్ఫ్ నిదర్శనమన్నారు. ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా అధికారులతో బడ్జెట్ అంచనాల రూపకల్పనపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా మారుమూల గ్రామాలు ఇంకా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలు లేనటువంటి గ్రామాలు ఎన్నో ఉన్నాయన్నారు. పల్లెల్లో తిరిగితే అక్కడ పరిస్థితులను చూసి బాధేస్తుందన్నారు. మన ప్రాంత అభివృద్ధి మన చేతుల్లోనే ఉందన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు జోడెద్దుల్లా కలిసి పని చేయాలని సూచించారు. వాస్తవాలకు అనుగుణంగా ప్రణాళికలు ఉండాలన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావడంతో పాటు వాటిని క్షేత్ర స్థాయిలో ప్రణాళికాబద్ధంగా ఎలా ఖర్చు చేయాలనే దానిపై బాధ్యతగా వ్యవహరించాలన్నారు. గూడేలు, తండాలతో పాటు గుట్టలపై ఉన్న ఆదివాసీలకు అన్ని విధాలా న్యాయం జరగాలన్నారు. ప్రతీ అధికారి తన పరిధిలోని సమస్యను మానవతా దృక్పథంతో పరిష్కరించేలా చూడాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రతీ పనికి సంబంధించి వాస్తవాలను వెల్లడించాలన్నారు. ప్రశ్నించే వారిపై కేసులు పెట్టడం సరికాదన్నారు. రాజ్యాంగంపై ప్రతీ ఒక్కరికి అవగాహన కల్పించేలా పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల్లో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించాలన్నారు. విద్యార్థులకు క్రీడా పోటీలు సైతం నిర్వహించాలని సూచించారు. అంతకు ముందు కేబీ కాంప్లెక్స్‌కు చేరుకున్న మంత్రికి అధికారులు పుష్పగుచ్ఛాలు, పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. కుమురంభీం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, పాయల్ శంకర్, జాదవ్ అనిల్‌కుమార్, గడ్డం వినోద్, కోవ లక్ష్మి, పాల్వాయి హరీశ్‌బాబు, ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కుమురంభీం జిల్లాల కలెక్టర్లు రాహుల్‌రాజ్, బాదావత్ సంతోష్, ఆశిష్ సంగ్వాన్, హేమంత్ బోర్కడే, ఇన్‌చార్జి ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డీఎఫ్‌వోలు ప్రశాంత్ బాజీరావు పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

6న మందమర్రికి మంత్రి సీతక్క

మందమర్రిరూరల్: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఫిబ్రవరి 6న మందమర్రికి రానున్నా రు. పట్టణంలోని కార్మెల్ హైస్కూల్ ఏర్పాటై 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పాఠశాల యాజమాన్యం డైమండ్ జూబ్లీ వేడుకలు నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరవుతారు. చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, డయాసిస్ ఆఫ్ ఆదిలాబాద్ ఎడ్యుకేషన్ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రిన్స్ ఆంటోని(బిషప్) కూడా వేడుకలకు హాజరుకానున్నారు.

మంత్రికి ఎక్సైజ్ కానిస్టేబుళ్ల వినతి

ఉట్నూర్‌రూరల్: మంచిర్యాల జిల్లాలకు చెందిన 2018 బ్యాచ్ ఎక్సైజ్ మహిళా కానిస్టేబుళ్లు మంత్రి సీతక్కను ఉట్నూర్‌లో కలిశారు. 317జీవో ద్వారా తమను బాసర జోన్‌లోని వివిధ ప్రాంతాలకు బదిలీ చేశారని, దీంతో 300 కిలోమీటర్ల దూరం వెళ్లి విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. తమను సొంత జిల్లాలకే బదిలీ చేయాలని సీహెచ్.శిరీష, సుజాత, జ్యోతి, పద్మ, సింధు తదితరులు వినతిపత్రం అందించారు. తర్వాత ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్‌శంకర్‌కు కూడా వినతిపత్రం ఇచ్చారు.

కేంద్రీయ విద్యాలయంలో చిత్రలేఖనం పోటీలు



చిత్రలేఖనంలో పాల్గొన్న విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: పరీక్షా పే చర్చాలో భాగంగా మంచిర్యాల కేంద్రీయ విద్యాలయంలో మంగళవారం జిల్లాస్థాయి చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన 100 మంది పాల్గొన్నారు. చంద్రయాన్, ఆదిత్య ఎల్–1, ప్రకాశిస్తున్న భారత్, క్రీడా రంగంలో ఇండియా, నేతాజీ సుభాష్‌చంద్రబోస్ తదితర అంశాలపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పోటీల్లో కేంద్రీయ విద్యాలయం విద్యార్థి తన్మయి(ప్రథమ), గ్రీన్‌వుడ్ హైస్కూల్ విద్యార్థి అశ్రిత(ద్వితీయ), శ్రీచైతన్య పాఠశాల విద్యార్థి వైష్ణవి(తృతీయ), మంచిర్యాల కేంద్రీయ విద్యాలయం విద్యార్థి సింధూజ(నాలుగో), కార్మెల్ హైస్కూల్ సీబీఎస్‌ఈకి చెందిన విద్యార్థి జశ్వంత్(ఐదో)స్థానంలో నిలిచారు. విజేతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు ప్రదానం చేశారు. న్యాయనిర్ణేతలుగా వెంకటస్వామి, ఆశోక్, శంకరయ్య వ్యవహరించారు. ప్రిన్సిపాల్ ప్రసాద్ పోటీలను పర్యవేక్షించారు.

విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు

మంచిర్యాలఅర్బన్: జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకుని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఉపన్యాస, వ్యాసరచన పోటీలు జిల్లా సైన్స్ కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. ఓటర్ లైక్ నథింగ్, ఓటు ఫర్ ష్యూర్ అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస విభాగంలో మంచిర్యాల బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి శివరంజని ప్రథమ, చెన్నూర్ చిన్నమున్ని పబ్లిక్‌స్కూల్ విద్యార్థిని హర్షిత ద్వితీయ, జన్నారం స్లేట్ హైస్కూల్ విద్యార్థిని అదిబా సాహెర్ తృతీయ బహుమతి సాధించారు. వ్యాసరచన పోటీల్లో కిష్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి సందేశ్(ప్రథమ), మంచిర్యాల సెవెన్‌హిల్స్ హైస్కూల విద్యార్థి గుండా వైష్ణవి ద్వితీయ, కుశ్నపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి హారిక తృతీయ బహుమతి సాధించారు. న్యాయనిర్ణేతలుగా రాజేశ్వరి, రాజన్న, నరసింహులు వ్యవహరించారు. విజేతలకు కలెక్టర్ బాదవత్ సంతోష్ చేతుల మీదుగా బహుమతులు అందజేయటం జరుగుతుందని డీఈవో యాదయ్య తెలిపారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష కోఆర్డినేటర్లు చౌదరి, రాజ్‌కుమార్, సత్యనారాయణమూర్తి, జిల్లా సైన్స్ అధికారి మధుబాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుడుంబా స్థావరాలపై దాడులు


స్వాధీనం చేసుకున్న నాటుసారా, బెల్లంపానకం

నెన్నెల: మండలంలోని నెన్నెల, లంబాడితండా, నార్వాయిపేట గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ సీఐ సమ్మయ్య ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించినట్లు చెన్నూర్ ఎక్సైజ్ ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. ఈ దాడుల్లో 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని 200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. లంబాడితండాకు చెందిన లావుడియా రమాదేవిపై కేసు నమోదు చేశారు. నార్వాయిపేటకు చెందిన గోపావత్ లక్ష్మిని బైండోవర్ చేసి తహసీల్దార్ ఎదుట హాజరు పరిచారు. నాటుసారా విక్రయించినా తయారు చేసినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో బెల్లంపల్లి, మంచిర్యాల ఎక్సైజ్ ఎస్సైలు నిర్మలపాటిల్, జీవన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితులకు జైలు

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో గతేడాది ఆగస్టులో జరిగిన చోరీ కేసులో నిందితులకు లక్సెట్టిపేట జూనియర్ సివిల్ కోర్టు జడ్జి అసదుల్లా షరీఫ్ జైలు శిక్ష విధించినట్లు ఎస్సై ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హన్మకొండకు చెందిన పాశం ప్రణీత్, అలియాస్ చింటూ, ఉమర్ ఫరూక్ గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో హుండీలను పగులగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లారు. కేసు నమోదు చేసి రిమాండ్ చేయగా విచారణ అనంతరం నిందితులకు మూడు నెలల 10 రోజుల జైలుశిక్ష వి.దిస్తూ జడ్జి తీర్పు ఇచ్చినట్లు ఎస్సై వెల్లడించారు.

మహిళ మెడలోంచి గొలుసు అపహరణ

రామకృష్ణాపూర్: పట్టణంలోని రాజీవ్‌నగర్ ఏరియాకు చెందిన ఆకిరెడ్డి శంకరమ్మ అనే మహిళ మెడలోంచి గుర్తు తెలియని వ్యక్తి బంగారు గొలుసు అపహరించిన సంఘటన మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. సదరు మహిళ ఇంటిముందు వాకిలి ఊడుస్తుండగా బైక్‌పై వచ్చినవ్యక్తి ఆమె మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసు ఎత్తుకెళ్లినట్లు పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఖందేవుని జాతరకు వేళాయె

- నేడు మాన్కాపూర్ వద్ద మాసేమాల్ పేన్ దేవతకు పూజలు
- 25న ఖందేవునికి తొడసం వంశస్తుల పూజలు
- 26న నూనె తాగనున్న తొడసం ఆడపడుచు
- 25 నుంచి ఫిబ్రవరి 8 వరకు జాతర

ఆదిలాబాద్ జిల్లా ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిల్లు... వారి ఆచార వ్యవహారాలు నేటి ఆధునిక తరంలోనూ పాటిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇందులో భాగంగానే ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని ఖందేవుని జాతర ఓ ప్రత్యేకత.. ఈ నెల 25న ఖందేవుని మహాపూజతో జాతర ప్రారంభం కానుంది. పదిహేను రోజుల పాటు నిర్వహించే ఈ జాతరకు దేశంలోని ఆదిమ గిరిజనులైన తొడసం వంశస్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. – నార్నూర్


నార్నూర్‌లోని ఖందేవ్ ఆలయం

మాసేమాల్‌పేన్ దేవతకు పూజలతో మొదలు...

బుధవారం రాత్రి మాన్కాపూర్ గ్రామంలో మాసేమాల్ పేన్ దేవతకు తొడసం వంశస్తులు ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం అక్కడి నుంచి 25న గురువారం రాత్రి దేశంలోని నలుమూలల నుంచి తరలివచ్చిన తొడసం వంశస్తులు ఖందేవ్ క్షేత్రానికి చేరుకుంటారు. రాత్రి వారి ఆచారం ప్రకారం ఖందేవునికి పుష్య పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 26న శుక్రవారం ఖందేవ్ ఆలయం సన్నిధిలో తొడసం వంశానికి చెందిన ఆడపడుచు నాగుబాయి చందు (కటోడ, గిత్తకు చెందిన) తొడసం వంశంలోని ప్రతీ ఇంటి నుంచి సేకరించిన రెండు కిలోలకుపైగా నువ్వులనూనె తాగి తమ రెండో మొక్కును తీర్చుకోనుందని తొడసం కమిటీ సభ్యులు తెలిపారు.

ఖందేవ్ పుణ్య క్షేత్రం వెలసింది ఇలా...

94 ఏళ్ల క్రితం నార్నూర్ గ్రామంగా మారినప్పుడు ఈ ప్రాంతమంతా దట్టమైన అడవులు, గుట్టలు, కొండలు, భయంకరమైన అడవి మృగాలతో నిండి ఉండేది. ఈ గ్రామానికి చెందిన తొడసం ఖమ్ము పటేల్ నిద్రలో ఉండగా ఖందేవుడు కలలోకి వచ్చి గ్రామం శాంతియుతంగా ఉండాలంటే తనను ఆరాధ్య దైవంగా స్వీకరించమని చెప్పాడు. మరుసటి రోజు ఖమ్ము పటేల్ తెల్లవారుజామున లేచి నలుగురు సమాజ పెద్దలను వెంట తీసుకుని వ్యవసాయ క్షేత్రానికి వెళ్లగా కలలో చెప్పిన స్థలంలో ఖందేవుడు ఓ స్తంభంలా వెలిశాడని తొడసం వంశస్తులు చెబుతున్నారు. అయితే ఆ రోజు పుష్య పౌర్ణమి కావడంతో ప్రతీ పౌర్ణమికి ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులను తీర్చుకుంటారు.

నువ్వుల నూనె సంప్రదాయ మొక్కు...

ప్రత్యేక పూజల అనంతరం 26న ఉదయం దేవుని సన్నిధిలో తొడసం వంశానికి చెందిన ఆడపడుచు రెండు కిలోల నువ్వుల నూనె తాగడం ఆనవాయితీ. ఒక్కరు మూడేళ్లు నూనె తాగాల్సి ఉంటుంది. ఆడపడుచు నాగుబాయి చందు నూనె తాగి రెండో మొక్కును తీర్చుకోనుంది. ఇలా తాగడంతో సంతానం లేదా ఏదైనా మంచి జరుగుతుందని వారి నమ్మకం.

26న దర్బార్, సంప్రదాయ భేటీ...

తొడసం వంశస్తులు మహాపూజ, సంప్రదాయ మొక్కులు చెల్లించిన అనంతరం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన తొడసం వంశస్తులు ఒక దగ్గరకు చేరుకొని సంప్రదాయ భేటి నిర్వహిస్తారు. ఆలయ అభివృద్ధితో పాటు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తారు. అనంతరం ఆలయ ఆవరణంలో మినీ ప్రజాదర్బార్ నిర్వహించి సమస్యలు వివరిస్తారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యేలతో పాటు ప్రజాప్రతినిధులు తరలివస్తారు. ఆలయ కమిటీ సహకారంతో తొడసం వంశ పెద్దలు బాపురావు కటోడ, ఆనందరావు కటోడ, రాజు పటేల్, తెలంగాణరావు పటేల్, నాగోరావు, స్థానిక సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్‌ల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

తొడసం విజయంగా ఏనుగు విగ్రహం...

ధృవరాజులు వారి పాలనలో ఏనుగులను యుద్ధం సమయంలో ఉపయోగించేవారు. రాజ్యంలో ఏనుగులు ప్రజల పంటలను ధ్వంసం చేయడంతో పాటు ఇబ్బందులకు గురిచేయడంతో వాటిని పట్టుకోవడానికి బహుమతి ప్రకటన చేశారు. తొడసం వంశస్తులు ప్రస్తుతం గాదిగూడ మండలంలోని రోమన్‌కాసా (అప్పటి గోండ్వానా రాజ్యంలో ఉన్న ఎనికాసా) గ్రామం వద్ద ఏనుగులు నిద్రపోతున్న సమయంలో పట్టుకుని ఖందేవ్ పుణ్యక్షేత్రం సమీపంలో చింతచెట్టు వద్ద కట్టేశారు. దీంతో ఆత్రం వంశానికి చెందిన రాజు 'సవ్వ చాలీస్' రాజ్యాన్ని తొడసం వంశానికి అప్పగించాడు. అప్పటి నుంచి ఏనుగును తొడసం వంశానికి విజయంగా భావిస్తూ ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

సంస్కృతిని కాపాడాలి


తరతరాల నుంచి వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ కాపాడాలి. నియమనిష్టలతో ఖందేవునికి పూజలు చేయడం జరుగుతుంది. దేశంలో ఎక్కడ ఉన్నా సరే తొడసం వంశస్తులు ఇక్కడికి రావాల్సిందే. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుంది. మహాపూజ, జాతర నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి.
– తొడసం బాపురావు, కటోడ

ఆనవాయితీగా వస్తోంది


మాతాత, ముత్తాతల కాలం నుంచి మా వంశ దేవుడైన ఖందేవునికి పుష్య పౌర్ణమి సందర్భంగా పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. మా సంస్కృతి, సంప్రదాయం ప్రకారం మొక్కులు తీర్చుకుంటాం. జాతర విజయవంతం చేయడానికి అన్ని రకాల చర్యలు తీసుకోవాలి.
– తొడసం తెలంగారావు, పటేల్

భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు


తొడసం వంశానికి చెందిన ఖందేవుని పూజ కోసం అందరి సహకారంతో అన్ని రకాల ఏర్పాట్లు చేశాం. ప్రతీ ఏడాది పుష్య పౌర్ణమి సందర్భంగా ఆనవాయితీ ప్రకారం పూజలు చేస్తాం. తొడసం వంశానికి చెందిన ఆడపడుచు నువ్వుల నూనె తాగి మొక్కు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తోంది.
– తొడసం నాగోరావు, ఆలయ కమిటీ సభ్యుడు

ఢిల్లీ గణతంత్ర వేడుకలకు 'గిరి' విద్యార్థినులు


అంజలి

సత్యభామ

ఆసిఫాబాద్‌రూరల్: ఢిల్లీలో జరుగనున్న గణతంత్ర వేడుకల్లో పాల్గొనేందుకు పట్టణంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు ఆత్రం అంజలి (9వ తరగతి), తుంరం సత్యభామ (9వ తరగతి)కు అవకాశం వచ్చినట్లు డీఎస్‌వో మీనారెడ్డి, హెచ్ఎం కృష్ణారావు మంగళవారం తెలిపారు. ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అంజలి, హ్యాండ్ బాల్ పోటీల్లో సత్యభామ ప్రతిభ కనబర్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఇందుకు విద్యార్థినులకు ఢిల్లీకి ఆహ్వానం అందినట్లు తెలిపారు. సదరు విద్యార్థినులను డీటీడీవో రమాదేవి, ఏసీఎంవో ఉద్ధవ్, ఏటీడీవో క్షేత్రయ్య, శిక్షకులు అరవింద్, తిరుమల్, విద్యాసాగర్ అభినందించారు.

కారుణ్య నియామకాలకు ఇంటర్వ్యూ


ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియా గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో మంగళవారం కారుణ్య నియామకాల కోసం ఇంటర్వ్యూ నిర్వహించారు. బెల్లంపల్లి ఏరియాలో ఇద్దరు ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ధ్రువపత్రాలను పరిశీలించి సింగరేణి సంస్థ ద్వారా అందే బెనిఫిట్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, డీవైపీఎం నాగుల వేణు, జూనియర్ అసిస్టెంట్లు బాబా, సరిత పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న డీటీవో కిష్టయ్య

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేలా స్వచ్ఛంద సేవకులు బాధ్యతగా పనిచేయాలని జిల్లా రవాణాశాఖ అధికారి ఎల్.కిష్టయ్య అన్నారు. మంగళవారం హాజీపూర్ మండలం వేంపల్లిలోని ఆశాఖ కార్యాలయంలో స్వచ్ఛంద సేవకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాసంస్థలు, మార్కెట్, బహిరంగ ప్రాంతాల్లోనూ రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు స్వచ్ఛంద సేవకులుగా విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. అతివేగం, డ్రంకెన్ డ్రైవ్, హెల్మెట్ వినియోగం, సీట్ బెల్ట్ ధరించడం, చిన్నారులకు వాహనాలు ఇవ్వకుండా నియంత్రించడం, ట్రాఫిక్ నిబంధనల పాటింపు వంటి కార్యక్రమాలపై వాహనదారులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ రాహుల్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ చంద్రయ్య, ఎన్ఎస్ఎస్ రాష్ట్ర సమన్వయకర్త ఉదారి చంద్రమోహన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

'దేశభక్తులుగా తీర్చిదిద్దాలి'

మంచిర్యాలఅర్బన్: విద్యార్థులను దేశభక్తులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తెలుగు ఉపన్యాసకులు సామల కిరణ్ అన్నారు. మంగళవారం తపస్ ఆధ్వర్యంలో కర్తవ్య బోధ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ఔన్నత్యం, సంస్కృతి సంప్రదాయాల ప్రాముఖ్యతను చిన్ననాటి నుంచి విద్యార్థులకు నేర్పించాలన్నారు. ఎంఈవో పోచయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలన్నారు. అలాంటి ఉపాధ్యాయుల్లో జాతీయ భావాలను పెంపొందించే అనేక కార్యక్రమాలను తపస్ చేపడుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బండి రమేశ్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, బగ్గని రవికుమార్, మహిళా ఉపాధ్యక్షురాలు రమాదేవి, ఆర్థిక కార్యదర్శి చీర సమ్మయ్య, నాయకులు నీలేష్‌కుమార్, అశోక్, రజిత, రమణయ్య, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

చెరువు 'నీరు'పయోగం


చెరువు శిఖంలో పాతిన ఫెన్సింగ్ పోల్స్

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాల్టీ పరిధిలోని రడగంబాల బస్తీ జాతికుంట చెరువు నిరుపయోగంగా మారింది. నీరున్నా ఆయకట్టుకు అందని దుస్థితి నెలకొంది. మండలంలోని బుధాకలాన్ గ్రామ సర్వే నంబరు 170/74లో రడగంబాల బస్తీ చెరువు ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల ద్వారా తెలుస్తోంది. ఆయకట్టు కింద దశాబ్దకాలం వరకు దాదాపు 85ఎకరాల్లో వరి సాగు కాగా ప్రస్తుతం 20ఎకరాలకు మించి నీరందించే అవకాశాలు లేవు. వరద నీరు వచ్చే ప్రధాన కాలువను ఆనుకుని శాశ్వత కట్టడాలు నిర్మించడంతో నీటి ప్రవాహానికి ఆటంకంగా మారింది. ఫలితంగా వరద నీరు దారి మళ్లుతోంది. చెరువు భూగర్భంలో, వరద నీరు వచ్చే ఎగువ ప్రాంతంలో పాల సముద్రం చెట్లు, పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగాయి.

శిఖం భూమిపై అక్రమార్కుల కన్ను

చెరువు నీటిమట్టం పడిపోవడంతో అక్రమార్కుల కన్ను శిఖం భూమిపై పడింది. దాదాపు 14ఎకరాల వరకు శిఖం భూమి ఉండగా.. ఇటీవలక ఒందరు ఆక్రమించినట్లు పంటసాగుదారులు, బస్తీవాసులు చెబుతున్నారు. కొందరు ఫెన్సింగ్ పోల్స్ ఏర్పాటు చేయడం ఆక్రమణ కోసమేననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చెరువు పూడిక తొలగించి నీరు వచ్చే ప్రధాన కాలువకు అడ్డుగా ఉన్న కట్టడాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. శిఖం భూమి ఆక్రమణకు గురి కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ రామునాయక్ కోరారు. కాగా, శిఖం భూమి ఆక్రమణపై బెల్లంపల్లి తహసీల్దార్ సుధాకర్‌ను సంప్రదించగా.. శిఖం భూమి ఆక్రమిస్తే ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. హద్దు దాటి పోల్స్ పాతినట్లయితే వెంటనే తొలగిస్తాం.

ఇసుక ట్రాక్టర్ బోల్తా.. ఒకరు మృతి


పరంధామచారి (ఫైల్)


బోల్తా పడిన ఇసుక ట్రాక్టర్

దండేపల్లి: మండలంలోని నంబాల సమీపంలో ఇసుక ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం కొండాపూర్‌కు చెందిన చిలుకూరి పరంధామచారి (35) గూడెం వెళ్లేందుకు ద్వారక నుండి గూడెం వైపు వెళ్తున్న ఓ ఇసుక ట్రాక్టర్ ఎక్కాడు. నంబాల సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి పంట పొలంలో బోల్తా పడింది. పరంధామచారిపై ఇసుక ట్రాలీ పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అజాగ్రత్తగా ట్రాక్టర్ నడిపి ఒకరి మృతికి కారణమైన డ్రైవర్ సురేందర్‌పై మృతుని సోదరుడు నాగభూషణం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మైకేల్ యార్క్ డాక్యుమెంటరీ ప్రదర్శన


మంచిర్యాలలో ప్రదర్శిస్తున్న డాక్యుమెంటరీ

మంచిర్యాలఅర్బన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని రాజ్‌గోండ్స్ సంస్కృతి, సంప్రదాయాలపై ప్రముఖ ఆంత్రోపాలజిస్ట్, పరిశోధకుడు మైకేల్ యార్క్ రూపొందించిన 'రాజ్‌గోండ్ రిఫ్లెక్షన్ ఇన్ ఏ పికాక్' బీబీసీ డాక్యుమెంటరీని మాసక్కని సిన్మా ఆధ్వర్యంలో మంగళవారం మంచిర్యాలలో ప్రదర్శించారు. డాక్యుమెంటరీ వీక్షించేందుకు ప్రముఖ నవలా కథా రచయిత అల్లం రాజయ్య, నిర్వాహకులు సినీ గేయ రచయిత చంద్రమౌళి, రాజేశం, శ్రీనివాస్, వెంకటేశ్, శ్యాం, మల్లయ్య, కవిత సుస్వర తదితరులు హాజరయ్యారు.

బోరు మోటార్ల దొంగల అరెస్టు

- వివరాలు వెల్లడించిన ఏసీపీ మోహన్

సాక్షి ఎఫెక్ట్..


పోలీసుల అదుపులో నిందితులు

జైపూర్: జైపూర్‌లో వరుసగా బోరు మోటర్ల చోరీల కలకలంపై 'బోరు మోటార్లు మాయం' అనే శీర్షికన ఈ నెల 18న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి పోలీసులు స్పందించారు. ఎస్సై ఉపేందర్‌రావు ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలు రాత్రివేళ తనిఖీలు చేపట్టి దొంగల ముఠాను అరెస్టు చేశారు. మంగళవారం జైపూర్ పోలీస్ స్టేషన్లో ఏసీపీ మోహన్ శ్రీరాంపూర్ సీఐ రమేశ్‌బాబుతో కలిసి కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. మందమర్రి మండలం గుడిపల్లికి చెందిన కుమ్మరి వెంకటేశ్, కామెర రాజ్‌కుమార్, సల్లూరి రాకేశ్ జైపూర్‌లో నూతనంగా నిర్మించుకుంటున్న ఇళ్లనే టార్గెట్‌గా చేసుకుని బోరు మోటార్లు, వైర్ల చోరీకి పాల్పడుతున్నారు. మంగళవారం వాటిని విక్రయించేందుకు బైక్‌పై వెళ్తుండగా రసూల్‌పల్లి వద్ద వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా మందమర్రిలో గుర్తుతెలియని వ్యక్తికి ఒకటి, సీసీసీ సీతారాంపల్లికి చెందిన గుంజపడుగు తిరుపతి అలియాస్ అశోక్‌కు మూడు విక్రయించగా మరో మోటారు విక్రయించడానికి తరలిస్తుండగా పట్టుబడినట్లు తెలిపారు. ఐదు మోటార్లు, వైర్, బైక్‌ను స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై ఉపేందర్‌రావు, హెడ్‌కానిస్టేబుల్ ఈజాజ్, కానిస్టేబుళ్లు సుబ్బారావు, సత్యనారాయణ, తిరుపతిలను ఏసీపీ ప్రత్యేకంగా అభినందించారు.

యువకుడు ఆత్మహత్య

- కొన్నాళ్లుగా మహిళతో చనువు..
- ఆమె కాదనడంతో అఘాయిత్యం


సల్మాన్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని అశోక్‌రోడ్‌కు చెందిన మహ్మద్ ఖాసీం కుమారుడు సల్మాన్ (30) స్థానికంగా ఓ బట్టల దుకాణంలో పనిచేస్తున్నాడు. అశోక్‌రోడ్ రోడ్‌లోనే ఉంటున్న ఓ మహిళతో కొంతకాలం చనువుగా ఉన్నాడు. ఆ తర్వాత సదరు మహిళ కాదనడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ నెల 22న పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ఆర్టీసీ బస్టాండులో పురుగుల మందు తాగాడు. ఆత్మహత్య చేసుకుంటున్నానని వాయిస్ రికార్డ్ చేసి వాట్సాప్ ద్వారా బంధువులకు సమాచారం అందించాడు. గమనించిన స్థానికులు 108లో గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకోసం కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందాడు. మృతుని సోదరుడు ఎండీ రఫీక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు గోదావరిఖని వన్‌టౌన్ ఎస్సై స్వామి తెలిపారు.

మత్తడి వాగు కుడి కాలువ తూము ధ్వంసం


నిలిచిన నీటిని పరిశీలిస్తున్న రైతులు

నెన్నెల: మత్తడి వాగు ప్రాజెక్టు కుడి కాలువ తూమును గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం ధ్వంసం చేశారు. తూము షెటర్ కూరుకుపోవడంతో నీరు బయటకు రావడం లేదు. దీంతో గొల్లపల్లి, మైలారం, దుబ్బపల్లి, జోగాపూర్ గ్రామాల పొలాలకు సాగునీరు అందడం లేదు. వరినాట్లు జోరుగా సాగుతున్న ప్రస్తుత తరుణంలో నీరు రాక పనులు నిలిచిపోయాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే రిపేర్ చేయకపోతే నాట్లు వేసిన పొలాలు ఎండిపోతాయని ఆందోళన చెందుతున్నారు. ఇరిగేషన్ అధికారులకు రైతులు ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ ఇందూరి శశికళ తెలిపారు.

ఒకవైపు దర్శనం.. మరో వైపు సేవ..

- అయోధ్యలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రఘునాథ్ చౌహాన్


శ్రీరామ పాదుకల దర్శనంలో రఘునాథ్ చౌహాన్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): అయోధ్యలోని మందిరంలో ప్రాణప్రతిష్ఠ అనంతరం బాలరాముడిని సోమవారం హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రఘునాథ్‌చౌహాన్ కుటుంబం ప్రత్యేకంగా దర్శించుకుంది. ప్రధాన సరయు నది, శ్రీరామ పాదుకలను సందర్శించడంతో పాటు లతామంగేష్కర్ చౌక్ తదితర ప్రాంతాలను సందర్శించి స్థానికంగా సేవా కార్యక్రమాల్లోనూ భాగస్వామ్యం అయ్యారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన సాధూ, సంతులతో కలిసి అయోధ్య సేవల్లోనూ పాల్గొన్నారు. సిద్దిపేటకు చెందిన అమర్‌నాథ్ సేవాసమితి ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణలోనూ పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. అయోధ్యలో తనకు సేవ చేసుకునే భాగ్యం కలగడం అదృష్టంగా భావిస్తున్నానని రఘునాథ్‌చౌహాన్ అన్నారు.

జిన్నింగ్ మిల్లులో అగ్ని ప్రమాదం


మంటలు ఆర్పుతున్న సిబ్బంది

కౌటాల: మండల కేంద్రంలోని వైష్ణవి కాటన్ మిల్లులో మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. జిన్నింగ్ మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు చేపడుతున్నారు. ప్రైవేట్‌లో సైతం జోరుగా పత్తి కొనుగోలు చేస్తున్నారు. మిల్లులో భారీగా పత్తి నిల్వలతో పాటు పత్తి బేళ్లు సైతం నిల్వ ఉన్నాయి. ఈ క్రమంలో విద్యుత్ మీటర్‌లో మంటలు చెలరేగాయి. గమనించిన సిబ్బంది అప్రమత్తమై మంటలు ఆర్పివేశారు. దీంతో భారీ ప్రమాదం తప్పిందని సిబ్బంది పేర్కొన్నారు.

ముగ్గురు బాల కార్మికుల గుర్తింపు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని పలు దుకాణాల్లో మంగళవారం ఆపరేషన్ రిష్మ్యా టీం అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లో పనులు నిర్వహిస్తున్న ముగ్గురు బాల కార్మికులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ బాల కార్మికులతో పనులు చేయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ అధికారి ఇందిరా, అధికారులు పాల్గొన్నారు.

కంచె కాటేసింది

- విద్యుత్ తీగ తగిలి ఒకరు మృతి
- కుమురంభీం జిల్లాలో ఘటన


భీము మృతదేహం

కెరమెరి(ఆసిఫాబాద్): కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలో విద్యుత్ కంచె ఒకరిని కాటేసింది. ధనోరా(కొలాంగూడ) గ్రామానికి చెందిన సిడాం భీము (45) వన్యప్రాణులను వేటాడేందుకు అమర్చిన విద్యుత్ తీగ తగిలి మృతి చెందాడు. ఈ ఘటన సావరికెడా, ధనోరా గ్రామ శివారులో సోమవారం రాత్రి జరిగింది. మృతుని కుటుంబ సభ్యులు, ఎస్సై విజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. ధనోరా(కొలాంగూడ) గ్రామానికి చెందిన సిడాం ఖట్టి సోమవారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో సిడాం భీము ఇంటికి వచ్చాడు. భీము ఇంట్లో లేకపోవడంతో అతని భార్య భీంబాయికి రాత్రి వేటకు వెళ్దామని, రెడీగా ఉండమని చెప్పి వెళ్లాడు. మృతుడు రాత్రి 8:30 గంటలకు ఖట్టి చెప్పిన ప్రాంతానికి వెళ్లాడు. అప్పటికే అక్కడ విద్యుత్ తీగ అమర్చి ఉంది. గమనించని భీము దానిని తాకడంతో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. భీంబాయి ఫిర్యాదు మేరకు ఖట్టిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.